రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి



విజ్ఞానపురికాలనీలో రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. విజ్ఞానపురి కాలనీ ప్రజల ఫిర్యాదు మేరకు నిర్మాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులకు ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 39 మంది లబ్ధిదారులకు రూ. 16,94,500 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, ఈఈ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని జయానగర్ కాలనీలో రూ. 17 లక్షలతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు త్వరగా తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, విష్ణు, షౌకత్ ఆలీమున్నా, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు


ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంటీ హిల్స్‌లో రూ. 25.30 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు , రాంనరేశ్ నగర్ రోడ్డు నంబర్-2లో రూ. 24.70 లక్షలు, రోడ్డు నంబర్-13లో రూ. 25.50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమాలకు హైదర్‌నగర్ డివిజన్ ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, పాత్రికేయ మిత్రులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

బతుకమ్మల నిమజ్జనానికి నీళ్లేవి..?



కూకట్‌పల్లి ఐడీఎల్ రంగనాయక స్వామి చెరువు వద్ద నీళ్లు లేని కొలను

కొలనులో వాటర్ లేక మహిళల ఇబ్బందులు



మూసాపేట: కూకట్‌పల్లి ఐడియల్ రంగనాయక స్వామి చెరువు వద్దనున్న కొలనులో నీళ్ల లేక మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినాయక నిమజ్జనం అనంతరం అధికారులు కొలనును శుభ్రం చేసి తిరిగి నీటిని నింపకపోవడంతో బతుకమ్మలు వేసేందుకు రెయిలింగ్‌ను దాటి చెరువులో ప్రమాదకర స్థితిలో నిమజ్జనం చేసే పరిస్థితి నెలకొన్నది. కూకట్‌పల్లి రామాలయం వద్ద బతుకమ్మ ఆడిన అనంతరం పీఎస్‌ఎం స్కూలు నుంచి చెరువులో నిమజ్జనం చేసేందుకు మెట్లు ఏర్పాటు చేసి లైట్లు ఏర్పాటు చేశారు. అయితే మూసాపేట, భరత్‌నగర్, వివిధ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, అపార్టుమెంట్ల మహిళలు కూడా బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ఈ చెరువు వద్దకే వస్తారు. కేవలం స్కూలు సమీపంలో మాత్రమే నిమజ్జనానికి ఏర్పాటు చేయడంతో ఇక్కడివారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా చెరువు వద్దనున్న కొలనులో నీటిని నింపి నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు

శ్రీ సాయి విద్యానికేతన్‌లో బతుకమ్మ వేడుకలు

మూసాపేట: ప్రగతినగర్‌లోని శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గార్లపాటి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెరువుల వివరాలు వెల్లడించాలి



కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: సీఎం రేవంత్‌రెడ్డి నల్ల చెరువు, సున్నం చెరువులపై ఇచ్చిన స్టేట్‌మెంట్ చూశామని, అయితే సున్నం చెరువు వద్ద అక్రమ కట్టడాలు, కూల్చిన పరిధి శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోకి వస్తుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. కూకట్‌పల్లిలోని అన్ని చెరువుల మీద విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని 2018లోనే తానే మొదటిసారిగా చెప్పానని పేర్కొన్నారు. ఇందుకోసం సమాచార హక్కు చట్టం ద్వారా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సంబంధించి పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. గతంలో చెరువుల పరిస్థితి ఏమిటి? ఎవరి హయాంలో ఎంత వరకు ఆక్రమణలకు గురైంది..? అన్న వివరాలు కోరానని తెలిపారు. కూల్చివేతల్లో దాదాపు 30 నుంచి 40 ఏళ్లుగా ఉంటున్న నిరుపేదలు అన్యాయం జరుగుతుందని, పూర్తి వివరాలు సేకరించి వారికి న్యాయం చేసి చెరువులను కాపాడాలన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ముళ్లకత్వ, కాముని, మైసమ్మ, సున్నం, ఐడీఎల్ రంగధాముని, నల్ల చెరువులు, ఖాజాకుంట పూర్తి వివరాలను తెలియజేయాలని కోరుతూ మేడ్చల్‌జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేశామని పేర్కొన్నారు. చెరువుల విస్తీర్ణం, ఆక్రమణలు, ఆక్రమణలకు గురైన చెరువుల పరిధిలో పట్టానా..? ప్రభుత్వ శిఖం భూమా? అనే వివరాలను సంబంధిత మ్యాపులతో చెరువుల వారీగా సమాచారం అందించాలని దరఖాస్తులో కోరారు.



సుమిత్రానగర్ పూజల్లో కార్పొరేటర్ రోజాదేవి రంగారావు దంపతులు



దేవీ శరన్నవరాత్రులు షురూ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో దేవీ నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. వివేకానందనగర్ డివిజన్ సుమిత్రానగర్‌లోని శ్రీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో అమ్మవారికి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు.



ఆల్విన్‌కాలనీ శ్రీ భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి ఆలయంలో..



పర్వత్‌నగర ప్రధాన రోడ్డులోని శివాలయంలో ప్రత్యేక అలంకరణ



మోతీనగర్ శంకరమఠంలో శారదామాతగా..



పర్వత్‌నగర్ చౌరస్తాలో ప్రత్యేక అలంకరణలో..



సుమిత్రనగర్‌లో శ్రీ బాల త్రిపుర సుందరీ దేవీగా..

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు



నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

బాలానగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. బాలానగర్ ఎక్సైజ్ సీఐ వేణు కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలకు చెందిన వెంకటేశ్ (24) ఎం తరుణ్ ఇద్దరు స్నేహితులు. వీరు ఒడిస్సాలో గంజాయిని కొనుగోలు చేసి ఫతేనగర్ పరిసరాల్లో అమ్మేందుకు వస్తుండగా బాలానగర్ ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. వారి నుంచి 4 కిలోల 962 గ్రాముల గంజాయిని, ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పరిచారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



అందజేస్తున్న కార్పొరేటర్ రవీందర్ రెడ్డి

బాలానగర్: బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి తన కార్యాలయంలో రాజుకాలనీకి చెందిన కె. సిద్ధప్పకు రూ. 22వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు.

నిందితుల కోసం గాలింపు

మూసాపేట: కేపీహెచ్‌బీకాలనీలోని లోధా అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న ఉదాసీన్ మఠంలోని చెట్ల పొదల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం బుధవారం లభించిన విషయం తెలిసిందే. అయితే మృతురాలు నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం అందాపూర్ గ్రామానికి చెందిన మహిళగా పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. భర్త నుంచి విడిపోవడంతో జీవనోపాధి కోసం 2 నెలల కిందట నగరానికి వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. ఇప్పటికే పలు పోలీస్ బృందాలు ఆమె ఆచూకీ కోసం, నిందితుల కోసం గాలిస్తున్నారు.

డీఈకి వినతిపత్రం

కుత్బుల్లాపూర్: సీపీఎం సూరారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో గాజులరామారం సర్కిల్ డీఈ శిరీషకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు




దుబాయిగేట్‌లోని వైష్ణవిమాతా ఆలయంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్ తదితరులు



కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న మక్కాల సత్యనారాయణ

ఓల్డ్ బోయిన్‌పల్లి: దేవీ నవరాత్రోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలో ఆకట్టుకునే మండపాల్లో అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. హస్మత్‌పేటలోని విజయదుర్గ ఆలయం, రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని శ్రీ కనకదుర్గ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతరంలో దర్శనం ఇచ్చారు. అలాగా ఆలయాల్లో అమ్మవారి చండీహోమం నిర్వహించారు. దుబాయిగేట్‌లోని వైష్ణవీమాతా టెంపుల్‌లో అమ్మవారికి స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్, రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ మక్కాల సత్యనారాయణ, నాయకులు బల్‌రాజు, చందుయాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామాజిక స్పృహ గలవారికి అవార్డు



గోపాలరావు

కూకట్‌పల్లి: సమాజ సేవ చేస్తూ సామాజిక స్పృహ గల మేధావికి రూ. 20 వేల నగదు బహుమతి అందిస్తామని ప్రజా ఆలోచనా వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు తెలిపారు. యేటా మార్చి 1న ఏ రంగంలో వారినైనా ఎంపిక చేసిన సామాజిక స్పృహ కలిగి సుపరిపాలన, న్యాయ పరిపాలన, ధర్మ పరిపాలన కోసం , ప్రజల కోసం కృషి చేసిన వారికి ఈ ఉగోరా అవార్డుతో గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. అవార్డు ఎన్నిక కమిటీ సభ్యులుగా మాజీ కేంద్ర సమాచార కమిషనర్, సీనియర్ జర్నలిస్ట్ మాడభూషి శ్రీధర్, ఆంధ్రప్రదేశ్ మాజీ సమాచార కమిషనర్, సీనియర్ జర్నలిస్ట్ దిలీప్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్, ప్రజా ఆలోచనా వేదిక అధ్యక్షుడు విద్య వెంకట్ వ్యవహరిస్తారని తెలిపారు. మరిన్ని ఉగోరా అవార్డు వివరాలను విద్య వెంకట్ త్వరలో ప్రకటిస్తారని పేర్కొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీశ్ గౌడ్, మహిళలు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కోలాటం ఆడి వారిని ఉత్తేజపరిచారు. అలాగా బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దసర పండుగకు ప్రత్యేక బస్సులు



కూకట్‌పల్లి డీఎం హరి

మూసాపేట: దసరా పండగ సందర్భంగా నగరం నుంచి ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి పేర్కొన్నారు. కూకట్‌పల్లి డిపో పరిధిలో సుమారు 35 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్య పెంచుతామని తెలిపారు. జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి విలేజ్ నుంచి కరీంనగర్, నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, రాజమండ్రి, అమలాపురం, కాకినాడ, కర్నూల్, అనంతపురం ప్రాంతాలకు బస్సులు నడుస్తాయని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీజేపీలో పలువురి చేరిక



నర్సింగరావుకు కండువా కప్పుతున్న ఎంపీ ఈటల రాజేందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీజేపీ నాయకుడు ఏనుగుల తిరుపతి ఆధ్వర్యంలో అంజయ్యనగర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ నాయకులు మక్కాల నర్సింగరావు, ఎం. శివకుమార్, ఎ రాజేశ్, వెంకటేశ్, ఎం. యాదగిరి, వెంకట్, సాంబరావు, రమేశ్, శ్రీకాంత్, ప్రమోద్‌కు ఎంపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనకు ఆకర్శితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.

డ్రైనేజీ పరిశీలన



పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బాబూరావు ఎండీ అశోక్‌రెడ్డి

మూసాపేట: బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లోని డ్రైనేజీని హెచ్‌ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్‌బీ ఎండీ అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా గురువారం మాజీ కార్పొరేటర్ బాబురావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభా దృష్ట్యా కొత్త లైన్లు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలమండలి జీఎం ప్రభాకర్, డీజీఎం శిరీష, మేనేజర్లు సలోమి, వినయ్, స్థానికులు జీవ, సత్యనారాయణ, కృష్ణా నాయక్, భాస్కర్‌రావు, ఆనంద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ పట్నంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మస్తాన్‌రెడ్డి

మోతీనగర్: ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి కీలకపదవి కట్టబెట్టారు. కేబినెట్ ర్యాంక్ హోదా గల శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డిని నియమించారు. దీంతో కాంగ్రెస్ యువ నాయకుడు, శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం కంటెస్టెడ్ ప్రెసిడెంట్ దేవరింటి మస్తాన్ రెడ్డి గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ కార్పొరేటర్ల పూజలు



మూసాపేట రేణుకా ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ కార్పొరేటర్లు

మూసాపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూసాపేట శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లికి అమ్మవారికి గురువారం పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, పగడాల బాబురావు నాయకులు సప్పిడి శ్రీనివాస్, జీత్‌రావు, శైలేష్ తదితరులు ఉన్నారు.

గొల్లపూడి పున్నారావుకు నాన్‌బెయిలబుల్ వారెంట్

రిమాండ్‌కు తరలించిన కూకట్‌పల్లి కోర్టు

సిటీ కోర్టులు: వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ ప్రొప్రైటర్ గొల్లపూడి పున్నారావుకు కూకట్‌పల్లి 13వ అడిషనల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది. నిచినో ఇండియా ప్రై.లి. కంపెనీ 2016 నుంచి హైదరాబాద్‌లో కెమికల్, ఫర్టిలైజర్ వ్యాపారం నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగానే ఆయా కంపెనీలకు ఫర్టిలైజర్ రసాయన మందులు తదితర మెటీరియల్‌ను సరఫరా చేస్తుంటారు. అయితే కొంతకాలం క్రితం పరిచయం ఆయిన గొల్లపూడి పున్నారావు నిత్యం నిచినో ఫర్టిలైజర్ కంపెనీ నుంచి రసాయన మందులు తీసుకెళ్తుండేవాడు. ఈ రసాయాలకు సంబంధించిన అమౌంట్ రూ. 19, 94 లక్షలు చెల్లించాల్సి ఉండగా చెక్ ఇచ్చారు. ఈ చెక్‌ను నిచినో ఫర్టిలైజర్ ప్రొప్రైటర్ పి.నర్సింగ రావు చెక్‌ను బ్యాంక్‌లో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యింది. అనంతరం పున్నారావు సంప్రదించకపోవడంతో నర్సింగరావు తరఫున న్యాయవాది కూకట్‌పల్లి కోర్టులో చెక్ బౌన్స్ కేసు దాఖలు చేశారు. కోర్టు నోటీసులు పంపినా రాకపోవడంతో నాన్ బెయిబుల్ వారెంట్‌ను కోర్టు జారీ చేసింది. దీంతో పోలీసులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఉన్న పున్నారావును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. విచారణ చేపట్టిన కోర్టు ఆయనను రిమాండ్ తరలించింది. అనంతరం పున్నారావు తరఫున న్యాయవాది బెయిల్‌పిటిషన్ దాఖలు చేయడంతో గురువారం విడుదల అయ్యాడు.

హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలి

జగద్గిరిగుట్ట: హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలో ఆర్టీసీ డిపో ఏర్పాటుకు సహకరించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేశ్ అన్నారు. ఈ మేరకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి సచివాలయంలో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఇతర జిల్లాలకు చెందిన సుమారు 50 బస్సులు ప్రతిరోజు రాత్రి నిలిపిఉంటాయని దీంతో డ్రైవర్లు, కండక్టర్లకు కనీస సౌకర్యాలు లేకపోగా, ఇప్పడున్న బస్టాప్ నిత్యం రద్దీతో ఉంటుందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహ, సమితి సభ్యులు ఏసురత్నం, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.